# చిగిరించిన ఆశ

నిజంగా ఆ చిన్నయిల్లు, ఆ యింటిముందర ఆ చిన్నతోట చూడటానికి యెంతో ముచ్చటగా వుండేవి. వాటినిచూసి సీను వుప్పొంగిపోతూ వుండేవాడు. సీనునిచూసి కావమ్మ మురిసిపోయేది.

కాని యీనాడు కావమ్మకు వున్నదల్లా ఆ శిథిలమైనతోట, కూలి పోతున్న యిల్లుమాత్రమే. ఇల్లునుమించి తోటను తనప్రాణంతో సమానంగా చూసుకుంటూవస్తున్న కావమ్మను ఋనాడు వాడిపోయిన రెమ్మలతో, యెండిపోయిన కొమ్మలతో పరిహసిస్తోంది తోట. ఏ వక్క పువ్వుకూడా విప్పారిన ముఖంతో కావమ్మను పలకరించటంలేదు. కావమ్మ హృదయంలోకి చొచ్చుకుపోయిన చిచ్చు, ఆమె కోరికలన్నింటిని దహించేసింది. మంచం మీద యిట్లా యెన్నాళ్ళని, యెప్పుడు దాటిపోతానా అనేదే ఆమె ఆవేదన.

"కష్టాలు వచ్చినప్పుడే నిబ్బరంగా వుండాలంటారు. మీ జబ్బేమో కొంచెం తిరుగుముఖం పట్టిందేను. తోటంటే పంచప్రాణాలు మీకు, చూడండి యెట్లా యెండిపోతోందో! వక్క పువ్వులేదు. వక్క కాయలేదు. ఎవర్నైనా మాలినిపెట్టండి" అంటుంది పారు, కామమ్మ మంచముదగ్గర కూర్చుని.

"ఎవరికోసం యీతోట. నువ్వు నన్నుగురించి యింత అదుర్దా యెందుకు పడుతున్నావో నాకు అర్థంకావటంలేదు. పారూ, నిజంగా చెపుతున్నాను. నేను యెవర్ని చూచుకుని బ్రతకాలని కోరిక పెట్టుకుంటాను ..........." అయాసపడిపోతోంది కావమ్మ.

"నేను చెప్పలేదుపారూ. ఈమెకు జీవించాలనిలేదు. నేను యెన్ని మందులు యిస్తేమాత్రం యేంలాభం. శరీరమా దారుఢ్యమైనదే..........." అన్నాడు డాక్టరు పారునుచూస్తూ.

"నాకు ప్రమాదంలేదు........పోనీ చేసుకున్న అమ్మాయిని వప్పుకుంటే వాడుబ్రతికేవాడేమో!........" కావమ్మ అస్పష్టంగా అనుకుంటున్న మాటల్లో వినపడ్డవి.

"అయ్యగారు కోపంతో యే ఘడియని వెళ్లిపోయారో అప్పటినుంచి తిరిగన్నా చూడలేదు........" పారు కన్నీళ్లు డాక్టర్ని స్తబ్దుణ్ని చేసినాయి.

"ఇంకెక్కడరావటం....కొట్టి చంపేశారు...." కావమ్మ అయాసం యెక్కువయిపోయింది.

ఒక పదినిమిషాలపాటు మట్లాడకుండా వుంటేకాని, కావమ్మ ఆయాసం పూర్తిగా తగ్గదని పారుకు తెలుసు. మెల్లిగా దుప్పటికప్పి వాకిట్లోకి వెళ్ళిపోయింది పారు.

పారును చూసేటప్పటికి, వాకిట్లో అరుగుమీద పడుకుని మూలుగు తున్న సుజాతకు ప్రాణంలేచి వచ్చినట్లయింది.

"పారూ!....నాదగ్గర యీ వుంగరంమాత్రం వుంది....నాకు కొంచెం డబ్బిచ్చావంటె ఆసుపత్రిలో పురుడుపోసుకుంటా" వుంగరంతీసి పారుచేతిలో పెట్టింది.

పారు నివ్వెరపోయింది. ఆ సమయంలో, ఏవిధంగా తాను సుజాతకు సహాయం చెయ్యాలో అర్థంకావటంలేదు.

కావమ్మ, వాకిట్లో సంభాషణల్ని పసికట్టింది. కర్ర ఆధారంగా కావమ్మ లేచివస్తుంటే, పారుకు గుండె ఆగినంత పని అయింది.

"అమ్మగారు....అమ్మగారు...." అంటూ పారు గబగబ కావమ్మ దగ్గరకు పరుగెత్తింది.